PDF Compressor Pro

ృందావన ప్రసూనం - 5

# నవకాళి

(మహాత్ముని అహింసా విజయయాత్ర)

రచన

గురుజాడ రాఘవశర్మ

బృందావన ప్రచురణలు

మచిలీపట్టణము.

PDF Compressor Pro

THE
B. N. K. PRESS, MADRAS.
4-50/2,000

మూల్యము 0-6-0

# తొలిపలుకు

ఆధునికమైన యీ యంత్రయుగంలో (ఆటంబాంబు యుగంలో) హింసా పద్ధతులందే, విశ్వాసంగలిగి, నిరంతర హింసాకాండలో, తాండవమాడే జాతులకు, అహింసా ప్రబోధాన్నందిచ్చి, అహింసాదిగ్విజయం, ప్రపంచాన చాటటం కొరకై, మహాత్ముణ్ణి, భారతావని, కోరి తెచ్చుకొన్నట్లు కనుపిస్తుంది.

మహాత్ముడుకోరింది, నిజంగా యీ స్థూలస్వాతంత్ర్యం కాదు. ఈస్వాతంత్ర్యం కొరకేకాదు ఆయన యుద్యమాన్ని సాగించింది. తన సత్యమార్గాన్వేషణలో, అహింసా ప్రబోధంతో, భారతావనికి స్వరాజ్యం సంపాదించడం, ఆయన జీవితాశయములలో నొకటి. ఆయన అభిలషించింది ఆత్మస్వారాజ్యం. ఈ సత్యాహింసా సాధనాలతో నే ఆయన ఆశయాన్ని చిట్టచివరకు సాధించింది.

బాల్యమాదిగ, జీవితమంతా, తదన్వేషణార్థమేనన్నట్లు, దక్షిణాఫ్రికాలో, ప్రారంభించిన, యుద్యమాన్ని, జన్మభూమియైన భారతవర్షంలో సాధించి, కృతార్థుడైనాడు.

అనేక ప్రముఖరచయితలు, మహాత్ముని, సత్యాన్వేషణామార్గాన్ని, వారి హితబోధలను, యేర్చి కూర్చి, వ్యాఖ్యానించారు.

ఈ నవకాళీ యాత్ర, ఆయన జీవితగ్రంథంలో ఒక అధ్యాయం. ఈ అంశాన్ని, అహింసాధర్మౌత్కృష్టాన్ని చాటే ఈ ఉపాఖ్యాన్ని పద్యరూపాన పొందుపఱచి, మాతృపదపీఠాన సమర్పించాను. విషయగౌరవమే నన్నీ చాపల్యమునకు బురికొల్పినది. గుణైకదృక్కులగు పెద్దలకు జోహారులు. నాయందలి వాత్సల్యముచే ఉపోద్ఘాతం వ్రాసియిచ్చిన శ్రీఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు, నా నమస్కృతులు.

మచిలీపట్టణము
26-1-50

ఇట్లు
గురుజాడ రాఘవశర్మ

PDF Compressor Pro

# పరిచయము

నామిత్రులు శ్రీయుతులు గురుజాడ రాఘవశర్మగారితో ప్రథమపరిచయము 1930 సంవత్సరమున రాజమండ్రి జైలులో గలిగినది. తిరిగి యీరోజు లభించినది. 'నవకాళి' యను వారి ఖండకావ్యమునకుపరిచయము వ్రాసియిమ్మనికోరి వారి వివిధగ్రంథములలో ప్రధానఘట్టములను, హృద్యముగా వినిపించి, నన్నానంద సముద్రునిగ జేసిరి. వారిదివరకే ఆంధ్రదేశమునకు సుపరిచితులు. వారిత్యాగము, శీలము, వారియుత్సాహము, కవిత్వము ఆంధ్రులు బాగుగ నెఱిగియేయున్నారు. క్రొత్తగ వారిని ఆంధ్రదేశమునకు పరిచయముజేయ నవసరములేదు. అయినను లాంఛనముగ కొన్ని పరిచయవాక్యముల వ్రాసెదను. అదియును నాకృతజ్ఞత దెలుపుటకే.

మహాత్ముని జీవితములో నవకాళి ఘట్టము ఒక నూతనాధ్యాయమును ప్రారంభించుచున్నది. ఉపసంహారాధ్యాయమనినను, చెప్పవచ్చును. మొదటి పద్యములోనే 'గదలె మహాత్ముడంత నవకాళికి, మారణకేళిభూమికిన్' అని హేంష్యముకూడ సూచింపబడినది.

మహాత్ముడు చెప్పినట్లు, ఆయన జీవిత ఘట్టములన్నియు 'My experiments with truth' సత్యముతోడి నాప్రయోగములు, లేక 'Truth experiments upon him' ఆయనపై సత్యముయొక్క ప్రయోగములనియు చెప్ప వచ్చును. ఆయన జీవితములో పరిశోధించి లోకమునకుజూపిన సత్యము, భారతములో ధర్మరాజు రాయభారమునకు శ్రీకృష్ణుడు బోవునప్పుడు చెప్పినదే. అది యిట్లున్నది.

చ॥ పగయడగించుటెంతయు, శుభంబది లెస్స యడంగునే పగన్
పగ, పగఁగొన్న మార్కొనక పల్కకయుండఁగవచ్చునే! కడుం
దెగ, మొగలెత్తికోవ పగదీర్పఁగఁగల్గిన క్రౌర్యమొందు, నే
మిగతిదలంచినన్ పగకు మేలిమిలేదు ధ్రువంబు, కేశవా!

PDF Compressor Pro


అనగా యుద్ధమువలన ప్రయోజనములేదు. అహింసామార్గమున కార్యమును సాధించుకొనవలయును.

జర్మనీ, ఘోర మారణ సాధనములనిర్మించి, దానిసహాయమున లోకమును స్వాధీనమొనర్చుకొనజూచెను. జపాను, దానిననుసరించెను. శేషించిన లోకమంతయు నొక్కటి రెండు మహాయుద్ధములుసలిపి, హింసామార్గముయొక్క నిష్ఫలత్వమును వెల్లడించినవి. అట్టితరి మహాత్ముడు అహింసామార్గము నవలంబించి, బ్రిటీషు సామ్రాజ్యముతో సత్యాగ్రహ సంగ్రామముసలిపి, 25 సంవత్సరములు జరిగిన పోరాటములో ఒక ఆంగ్లేయునైన చంపక, తాను తనయనుచరులును, మహా కష్టములనుభవించి, తుదకు శత్రుత్వ సంహారముగావించి స్వరాజ్యము సంపాదించి, ఉభయజాతులును, సమానహోదాగల మిత్రులవలె 'Commonwealth,' ప్రజాస్వామిక సభ్యులుగనుండి, లోకశ్రేయస్సునకై పాటుబడుచున్నారు. బర్మా, సిలోను, పాకిస్థానులకుకూడ స్వరాజ్యము లభించినది. ఫ్రాన్సు, ఇటలీ, హాలెండులు, ఏ పోరాటముసల్పక, గాంధిమార్గము ననుసరించి, తమ సామ్రాజ్యముల విచ్ఛిత్తి గావించుకొనుచున్నారు. ఆఖరుకు రష్యాకూడా స్టాలిన్ జన్మదినమున లోకశాంతి బహుమతులు నెలకొల్పినది.

ఇండియాలో, మహమ్మదీయులు, సత్యాగ్రహసమరమున జేరకుండుటచేతను యితర మహమ్మదీయదేశములు, యిరోపా మహాసంగ్రామమునకు దూరముగా నుండుటచేతను, హింసామార్గముయొక్క నిష్ప్రయోజనము వారికి బోధపడలేదు. అందుచేతనే జిన్నాగారు, హింసామార్గమున, అహింసాపరులగు హిందువులను బాధించి, పాకిస్థానమును వృద్ధిజేసికొనజూచెను. కలకత్తాకును, పశ్చిమ పాకిస్థానమునకు మార్గము సంపాదంపగోరి, కలకత్తాలో హిందువులను ఖూనీచేయించి, యచ్చట విఫలుడయ్యెను. కలకత్తాలో హిందువు లధికమగుటచే, నోడితినని తలచి, తూర్పుబంగాళములోని, నవకాళీలో హింసాకాండము మొదలిడెను. అందు కొంత విజయముగలిగినదని తలంచి, దక్షిణ భారతములోగూడ, మహమ్మదీయు లెక్కువగానున్నచోట, హింసలుచేసి, శాంతస్వభావముగల, దాక్షిణాత్యులను భయపెట్ట

జూచెనుగాని, ఇంతలో బీహారులో 'నవకాళీ కాబదలా' అని హిందువులు, ప్రతిక్రియకు మొదలిడి, నవకాళీకి కొన్నిరెట్లు ముస్లిముల నంతమొందించిరి. జిన్నాగారు హిందువు లధికముగనున్న రాష్ట్రముల, తన ఉద్యమము విరమించి, పశ్చిమ పంజాబులో వధలును, స్త్రీల యపహరణములును ప్రారంభించెను. ప్రతిక్రియ, ముస్లిములవధలు, పశ్చిమ పంజాబులోకంటె, నినుమిక్కిలిగ జరిగెను. ముస్లిం స్త్రీలు, హిందూస్త్రీలకంటె, నెక్కువగా అపహరింపబడిరి. అంతటితో జిన్నాగారికి హింసాపద్ధతుల నిష్ప్రయోజకత్వము రుజువయినది.

అప్పుడు మహాత్ముడు తన యుద్యమమును ప్రారంభించి ఈ గ్రంథములో వర్ణింపబడిన విధముగ ముస్లిముల హృదయపరివర్తనమునకై ప్రయత్నించెను. కొంతవరకు పనిసాగినది. కాని యది స్థిరముగ ముస్లిముల హృదయమున నెలకొనుటకై, ఆత్మ బలిగావించుకొనవలసి వచ్చెను. 'ఏసు' సిలువపై పాపులనుద్ధరించుటకు బలియైనట్లు, మహాత్ముడు తననే బలిగ సమర్పించెను. జిన్నాయును అంతరించెను. మతద్వేషములకు అతీతమయిన స్వరాజ్యమును స్థాపించుటకు మార్గమేర్పడెను. ఇదియే గాంధిబలియొక్క అంతరార్థము.

ఈ ఘట్టమును రాఘవశర్మగారు ఉచితరీతిని, పాఠకుల హృదయముల కెక్కురీతిని, మృదుమధురభంగిని వర్ణించి చరితార్థుడయ్యెను. అందు పొందుపఱుపబడిన భావములు, భావమునకు దగినభాష, ఎంతయు సముచితముగనున్నవి. ఆంధ్రలోక మిదిస్వీకరించి వారికృతజ్ఞతకు పాత్రమగునుగాక.

గుంటూరు
18-1-50

వున్నవ లక్ష్మీనారాయణ.

PDF Compressor Pro

# ఆశీస్సు


అచ్చట జరిగిన ఘోరహత్యలచే "నవకాళి" అన్వర్థనామమయ్యెను. భీభత్స, భయానక రసములను, మృదుమధురశైలిలో — ఈ చిన్న కావ్యమున శ్రీ గురుజాడ రాఘవశర్మగారు పోషించియున్నారు. పాకము—ద్రాక్షపాకము. అనేకచోట్ల కరుణారసమును చిలికి, వెదజల్లియున్నారు. తుట్టతుదకు, రాళ్లకన్న గూడ కఠినమైన ఘోరహంతకుల హృదయములను వెన్నవలె కరగించిరి. యిందు గాంధీమహాత్ముని యొక్క మాహాత్మ్యమునుగూడ వెల్లడించిరి.

కావ్యము చిన్నదైనను, మంచిరచన. శైలి, భావపుష్టిచే—యిదియొక గొప్ప కావ్యమునకు పూర్వపీఠికగా ఎన్నదగియున్నది. ఇట్లే, గాంధీ మహాత్ముని యొక్క జీవితచరిత్రనుగూడ, శ్రీ రాఘవశర్మగారు పూర్తిగా నొక పద్యకావ్యముగ రచించి, అందులో 'నవకాళిని' తదనుగుణమైన స్థానమునందిమిడ్తురని ఆశిస్తున్నాను

పార్లమెంట్, న్యూఢిల్లీ
16-3-50

ఇట్లు
మాడభూషి అనంతశయనం అయ్యంగారు,
డిప్యూటీ స్పీకర్

PDF Compressor Pro



శాంతి దూత

PDF Compressor Pro

# నవకాళి

చ॥ అది ప్రళయోగ్రదారుణ భయంకర దుస్సహ పాపచిత్త దు
ర్మదజను లేచి, హైందవులరక్తము వెల్లువఁ జేసినట్టి తా
వదె, 'నవకాళి'మండలము యత్నముచే నట శాంతినిల్పఁగాఁ
గదలె మహాత్ముఁడంత నవకాళికి, మారణకేళిభూమికిన్.

చ॥ చని, యట ఘోరకృత్యములసంగతి కండ్లకుఁగట్టినట్లు తాఁ
గని, పయిగ్రమ్ము దుఃఖ మొకకంటను మ్రింగుచు, సాటిమానవుం
డన కిటు హైందవాళి నకటా! పొరిగొన్న మహమ్మదీయులన్
గని, నిజశాంతముట్టిపడఁగా, వచియింపఁదొడంగె, ధీరుఁడై.

మ॥ మిము దాక్షిణ్యవిహీనచిత్తులని, స్వామిద్రోహులంచేవో పా
పము లారోపణసేయుచుందురు, స్వభావంబయ్య! మీభ్రాతృభా
వము గోరీలనుఁ బూడ్చిపెట్టితిరొ! యాపాశ్చాత్యసంపర్క దో
షము మీకంటెనొ! 'క్రైస్తవుం'డట! ప్రపంచంబంత
గాలించినన్.

శా॥ దేశద్రోహులటంచు, నీచులని నిర్దేశించి, విశ్వాసమున్
లేశమ్మున్ గనఁబోక, నమ్మరఁట మౌల్వీనైన, మీమీ మతా
వేశోన్మత్తులొనర్చు దుండగము లీభేదమ్ముఁ గల్పించెఁగా
మీశుశ్రూషలఁ గూడఁ బెంపుఁగనెఁ జుమ్మీ! భారతంబంతయున్.

PDF Compressor Pro

సీ॥ యశమునకై ప్రాకులాడెఁగా "తైమూరు"
దుష్కృత్యముల జాతిఁద్రుంపలేదె
తామతోన్మాదనృత్యముఁజేసె "నౌరంగ
జే" బిట్లు జాతి ద్వేషింపఁడయ్యె
కనకమ్ముపై నాస కదలించెఁగా 'గజ
నీమహమ్మదు' చంపనేరఁ డిట్లు
సామ్రాజ్యకాంక్షచేఁ జచ్చె 'నలెగ్జాండ్రు
ప్రభు' విట్లు జాతిపైఁ బగనెఱుఁగడు

గీ॥ నెమలిసింహాసనమ్ముపై నిలచినారు
చక్రవర్తులై యేలి రీక్ష్మాతలమ్ము
కాని, యేనాడు మతవైర మూననట్టి
యీ ముసల్మాను లొనరించు హింసలేమొ
కటకటా! నాకుఁ జెప్ప శక్యంబుగాదు.

మ॥ అవురా! మీయెడ దోషమెంచుటలు గాదయ్యా! ముసల్మానులా
ర! విచిత్రమ్ముగదయ్య! స్వీయమతధర్మంబేదయా! సర్వమా
నవసౌభ్రాత్రత నెల్లఖండములలోనన్ బోధగావించి, మా
నవధర్మమ్ములె మట్టిఁజేసితిరె! యీనాడిట్టి, హేయస్థితిన్.

క॥ అని పల్కుచు, నెడనెడఁ బై
కొను దుఃఖము లోననాపికొనుచున్ 'నవకా
ళి'ని నుద్దేశించుచుఁ బ
ల్కెను నిజహృదయమ్మునన్ జలింపని దీక్షన్.

PDF Compressor Pro


మ॥ నవకాళీ పరదేవతా! భరతసంతానాశ్రితా! దివ్యవై
భవసంశోభిత! భక్తలోకనుత! విశ్వక్షేమసంకల్పతాం
డవకేళీస్థిత। సర్వమంగళ! జగన్మాతా! దయోపేత! శాం
భవి! ప్రేరేఁచి, యనుగ్రహమ్ముఁ గురియింపన్ నాపయిన్ బిల్చితే.

ఉ॥ నీదయ నిల్చినాడ జననీ! యికచాలు, నుపేక్షసేయఁగాఁ
గాదుసుమీ! బిరాన నడుగన్ దొరకొంటి, క్షమింపుమమ్మ; నీ
పాదరజమ్ముసోకి, యతిపావనమైతగు పుణ్యభూమిలో
సోదరులై మెలంగు మనుజుల్ పొరపొచ్చెము వీడరేలకో!

మ॥ నవకాళీపరదేవతా! తెలిసె నీనైజమ్ము, నేఁడైన మా
నవ! వాత్సల్యమ దేడదాచితివొ! లోనన్ బ్రీతియే స్వీయ సైం
దవరక్తమ్మది, 'ఛిన్నమస్తక' వె! మాతా! కంఠహారాలె మా
నవ కంకాళము, లీధరిత్రి నిది యానందమ్ము కాదమ్మరో!

శా॥ శాంతింజెందఁగదమ్మ! నీచిలిపిచేష్టల్ నీకు, నాకేరికిన్
సంతోషింపఁగఁగావు, చెల్లెనెటులో, సైరింపఁబోమింకఁ, బ్రా
ణాంతంబైనను చెల్లనీయనుగదమ్మా! నీదుహింసాకృతుల్
పంతంబుల్ సరికావు నీకడఁ గృపన్ బాలింపుమా! మాతరో?

ఉ॥ హైందవులైననేమి యిఁక, మహమ్మదుసంతతి వైననేమి, మే
మందర మొక్కటేకద! గృహమ్మున నీకృపఁబుట్టి, పెర్గి, యా
నందమునన్ జరించితిమె నాఁడును నేడును లేనియట్టి యీ
ఛిందరవందరల్ కఱకుసేఁతలిసీ! యెటు దాపరించెనో!

PDF Compressor Pro



మ॥ క్షమియింపంగదవమ్మ! సోదరులు దుష్కార్యమ్ము లేవేవొ న్యా
యమొ యన్యాయమొ సల్పినార, లిటు; హేయంబౌ
పథంబం చెఱుం
గమి; త్రిప్పంగదె సత్యమార్గమున, స్వర్గంబింక వేఱున్నె! ని
త్య మహింసావ్రతపాలన స్థితివినా, ధర్మమ్ము వేఱున్నదే!

మ॥ అకటా! సోదరు లెప్డులేని దిటు క్రోధావేశులై, ఘోరనా
రకముఁ జేసిరి, పుణ్యభారతము, స్వార్థంబెల్లఁ బ్రేరేప, నూ
రక నీవుండుట పాడిగాదిఁక, జగద్రక్షాస్వదీక్షాస్వరూ
పకవై వెల్గినతల్లి నీకివె నమోవాకమ్ము లర్పించెదన్.

మ॥ ఒకనాడుం గలగంటిమే! యిటులనయ్యో! పర్వెగాఁ గీర్తిచం
ద్రికలాశాంతము, నేడధఃపతితవై, నిర్వీర్యవై పోయెనే,
యకటా! భారతజాతి, శాత్రవుల దౌష్ట్యమ్మంతమున్ జేయనో
పక సైరింతురొకో! పతివ్రతల శాపం బూరకే పోవునే!

క॥ అని పల్కు లోవిషాద
మ్మునను మహాత్ముఁడు, దృశ్యములఁ గాంచుచుఁ దాఁ
జనుచుండెను, హైందవులుఁ
వెనువెంటఁ జనుచుఁ దెల్ప వృత్తాంతములన్.

సీ॥ ఇవె! తీర్చినట్లున్న వీలోన రంగవ
ల్లికలెంతయున్ జెఱుంగకయె యింట
ఇదె! నుసివారియున్నది హోమభస్మ మీ
యగ్నికుండమ్మునం దణఁగి, మణఁగి

ఇదె! దేవతార్చనాసదనమ్ము వెల్వెలఁ
బోయెను విగ్రహమ్ములు హరింప
ఇదె! సాము గరిడీల కిమ్ముగఁ బేతాళ
కాళీ, హనుమ, విగ్రహాలతావు

గీ॥ ఇదె! మహోన్నత వప్రసంవృతము, శిఖర
దీప్తిమన్మూర్తి సుందర దేవళమ్ము
చెన్నుదఱిగిన దీనాడు చిన్నవోయి
యర్చనాదులుఁ దగువిగ్రహములు లేక.

సీ॥ దుర్మదకోటి కత్తులగండ్ర గొడ్డళ్ళ
సానబెట్టెడి, యంత్రశాల యిదియ
పాపలఁ దల్లులఁ బాటింపకే తెగ
వ్రేయు తురుష్క కసాయిసాల
చిందర వందర చెదరి పాఱినవి నె
త్తురు మడ్డులిచ్చోటఁ గరుడు కట్టి
దుర్వాసనలుజిమ్మఁ దునిమిన నరకళే
బరముల నరకకూపమ్ముసుమ్మ!

గీ॥ ఇట మతోద్రేకులే తెంచి, హిందువులను
స్వీయ మతమునఁగల్పఁ దెచ్చినతలమ్ము
లివె! మసీదులుకాబోలు! యిటమతమ్ము
మసియొనర్చిన తావిది కసిమసంగి.

PDF Compressor Pro



సీ॥ ఏమూలఁగనుగొన్న నెముకలప్రోవులే
తినదిండి లేనట్టి దీనజనమె!
ఏ చక్కిఁగనుగొన్న హృదయాలు కంపింప
'హా! నాథ!' యనెడి హాహారవములె
యేయింటదూరిన హీనస్వరమ్ములన్
బిడ్డలకై విలపించుజనమె
యేతావుఁజేరిన నెటుమెదల్పగశక్తి
లేనట్టి యంగవిహీనజనమె।

గీ॥ యొకట రెంటనుగాదిట్టు లూరనూరఁ
జెట్టు గుట్టను, నింటింట, శిథిలదేవ
ళమున, బయటను, నార్తనాదములుఁ జెలఁగెఁ
గటకటా! యింకవీరి కెక్కడిది దిక్కు!!

సీ॥ ఇచ్చోటనేకదా! హిందూ పతివ్రతా
స్త్రీలమానమ్ము హరించినారు
ఈతావుననె కదా! యింతింత లేసి బా
లికల బాలురఁ దస్కరించినారు
ఇచ్చోటనే కదా! యింటింటి కగ్గిర
గిల్చి సపాటమ్ముఁ గూల్చినారు
ఈపట్టుననె జీవనోపాధిగా దాచు
కొన్న యాస్తులఁ గొల్లగొట్టినార

PDF Compressor Pro



గీ॥ లేమనందుము! కటకటా! యిట్టి ఘోర
నరకమింకనున్న! 'నవకాళి' ధరణిగాక
సాటిమానవుఁడనుబుద్ధి, జాలి లేదె!
దేశదౌర్భాగ్య మిదిగాక, దేవుఁడెచట?

సీ॥ కుక్కనక్కలుదూరి కుయ్యోడుచున్నవి
తలుపులు లేని గీములె యివన్ని
ఇంటికప్పుల నగ్గి యంటుకొనఁగ నిల్చె
మొండిగోడలగృహమ్ములె యివన్ని
గుంజలుపడిపోవ గుర్తింపఁగారాక,
కూలిపోయినవి గృహాలివన్ని
సందువీధులెఱుంగ శక్యమ్ముగాక చిం
దఱవందరై పడె తరులివన్ని

గీ॥ వాయుదేవుని ప్రళయభీభత్సగుణమొ!
యగ్నిదేవుని తీక్ష్ణకార్యమ్మొ! లేక
వరుణదేవుని ప్రళయరూపమ్మొ! యిన్ని
కలసి కాలుని ప్రళయసంకల్పమేమొ!

సీ॥ తనమానరక్షణార్థము పెనంగెను సతి
చిట్లినగాజులు చెదరె నిచట
మానమే ప్రాణము మానినికని వీడె
ప్రాణముల్ ప్రమానిపై మానిని యిటఁ

PDF Compressor Pro


పరమతస్వీకారభయముచే నేతల్లి
బిడ్డతో ప్రాణముల్ వీడెనిచట
చెట్టున కంటగాఁ గట్టి గృహస్థుండు
ప్రాణముల్ నిలువునఁ బాసె నిచట

గీ॥ ప్రాణరక్షణకై, యింటిపైన దూఱి
నగ్నినంటింప, హుతమయి, యట్టిరాలె
మారిమసఁగినయట్టి యూరూర నెచట
గాంచ నంత శ్మశానమ్ముఁగాగఁ దోచె.

ఉ॥ దారుణశత్రుబాధలకుఁ దాళక, దారసుతాదులేగ, సం
సారములన్ దరల్చిరి వెసన్, జనశూన్యగృహాలు కాలి చ
ల్లారినకట్టియల్, చెదరి, యట్టిటుఁ గన్పడు పీన్గుపెంటలున్
జేరిన కాకఘూకములిసీ! కనుపించె శ్మశానభూమిగా.

సీ॥ గుఱిజూచి, తనగండ్రగొడ్డలి పెట్టునన్
బరిమార్పవెన్నాడు వైరియొకఁడు
కంఠమ్ముఖండింపఁగా హస్తమందు క
సాయికత్తులఁ జనుశత్రువొకఁడు
ఈటెకత్తుల ప్రక్కపోటుల నుఱుమాడ
మాటునఁజనెడి దుర్మార్గుఁడొకఁడు
చెంపదెబ్బయొసంగి, చంపెదనని, వీల
రయుచుండు క్రూరదుర్మనుఁడొకండు

PDF Compressor Pro



గీ॥ బక్కబడుగీతఁడెంత, తుపాకిగుండు
కెరగఁ జేతునటంచు, నూహించునొకఁడు
నలుదెసల్ గ్రమ్ము శత్రుమండలి నెఱింగి
యాత్రసాగించి నడచె, మహాత్ముఁడపుడు.

మ॥ బలహీనంబుగ దోచు మేను, మొలఁ ద్రిప్పంజాలు వస్త్రమ్ము, నా
మొలపైనన్ గడియార, మొప్పగు నురమ్మున్, దాల్చె కే పాదర
క్షలు; చేఁగఱ్ఱయుఁ గల్గఁ జోడుగని, సాగన్ వచ్చె నాజానుబా
హులసమ్మోహనవిగ్రహుండు, కనుమోహో! బ్రహ్మతేజోనిధిన్.

ఉ॥ వైరిగృహాల రాత్రులనివాసము, వారలొసంగుపండ్లె యా
హారము, చెట్టునీడలవిహారము, వెన్నెలరాత్రులందు సం
చారము, లూరనూరను బ్రచార మహింసగురించి, హైందవా
చారమునన్ మహాత్ముఁడు విచారము లేకయె యాత్రమైచనెన్,

చ॥ భయము రవంత లేదు, యరివర్గమటన్న యళంకు లేదు, ని
శ్చయములవంత వీడడు, ప్రశాంతముఖమ్మది మారబోదు, సం
శయమది లేనెలేదు, తన సాధనలన్ సడలింప లేదు ని
ర్భయముగ, శాంతిదూతగఁ బురమ్ములు బల్లెలుఁ జొచ్చియేగెడిన్.

చ॥ విడువడు విశ్వరక్షకుని ప్రేరణచే చనుచున్నమార్గ, మిం
కడుగఁడు దేశసైనికసహాయము మొసంగెదమన్నఁగూడ, లో
నుడుగఁడు శత్రువర్గవిలయోగ్రపథంబును మార్చుయత్న మిం
కడుగడుగున్ గదల్చు నభయంబిడు, హైందవమానరక్షకై.

PDF Compressor Pro


మ॥ తమప్రాణంబులకంటె ప్రాణమయి, భద్రంబై మహాస్వర్గ ధా
మమునై రాజిలు విగ్రహాలను మతోన్మాదుల్ కడున్ రేగి, ఘో
రముగా ద్రుంచు నుదంతమున్ దెలుపఁ జేరన్ బోయి, చూపించి, దుః
ఖమునన్ హైందవు లామహాత్ముదరి మూగన్ ; లేచి, యా తం
డనున్.

సీ॥ ఏమహాదాత తరించె నిర్మించి, సం
తతివృద్ధినొందఁగాఁ దరతరముల
నేమహాశిల్పి రచించి, జీవించెనో
తఱుగని దివ్యచిత్రకళ దిద్ది
యేమహాభక్తుల హృదయతంతులువిచ్చి
స్రవియించె చైతన్యసారమెల్ల
నేమహాసతులు సుఖించి రైదువులుగా
మంగళాక్షతల సన్మహిమనొంది

గీ॥ యెంతలెంతలుగా నిట నింతదాఁక
జరిగె కోలాహలముగ నుత్సవములెన్నొ
కటకటా! యిట్టిదివ్యవిగ్రహము లిపుడు
మహిమఁ బ్రకటింప విధియేమొ! మాతృభూమి.

చ॥ మహిమము లేక కాద, యవమానము లింత భరింపఁగాద, దు
స్సహరిపువర్గచేష్టలకు జంకుటగాద, యమోఘమైన దు
ష్టహరణశక్తికిన్ మిగులఁ జాలక కాద, యభీష్టకార్య ని
ర్వహణమొనర్ప, భక్తజనరక్షణసేయఁగలేక కాదిటన్.

PDF Compressor Pro



ఉ॥ మౌనము దాల్చియుండుట, లమానుషకృత్యము లాచరించు నీ
హీనజనప్రవాహ మొకయెల్ల నెఱుంగక ముంప నడ్డగా
లేనియటుల్ చరించి, యవలీలగఁ జిక్కుట, తేరినంటగా
నీని మహత్వ, మేమెడకు నేగెనొ! డాగెనొ! లోనెఱుంగకే.

మ॥ ఘనసిద్ధౌఘములిందు లోకహితసంకల్పార్థమై పెఁ దపో
ధనముల్ లోఁ బ్రసరింపఁ జేసెనిదె; చైతన్యమ్ము మూర్తీభవిం
చిన దీవిగ్రహమందు, భక్తజనులీ చిన్మూర్తి సేవించి, ము
క్తినిధానమ్మును జేరి, రిప్పుడిట లేదే! శక్తి యీమూర్తిలో!

ఉ॥ లేదననేలశక్తి, యెటలేదు! జగమ్మఖిలమ్ము శక్తిచేఁ
గాదె ప్రతిక్షణమ్ము వెలుగన్ మనగల్గెనయారె! యగ్నితా
బూద్రిని గ్రమ్మఁగాఁబడిన, ముట్టినఁగాల్చదె! యజ్ఞులైనవా
రేదా వచింత్రు, లోకమటులే చను గ్రుడ్డిగ, తప్పుదారులన్.

శా॥ సర్వవ్యాపకశక్తి భాసిలె విశేషప్రాభవంబొప్ప నీ
నిర్వీర్యంబగుజాతి కర్మవశతన్ నిస్తేజమై రూపఱెన్
బత్వేఁ గ్రమ్మఱఁ దొంటియట్ల ప్రతిభావంతుల్ విలోకింతు రీ
యుర్విన్ స్వీయహృదంతరాళముల విద్యుద్దీప్తశక్తిన్ సదా.

శా॥ సంచారంబొనరించు దేవళము లా సాధుల్, జగంబెల్ల భా
సించున్ వీరల ధర్మవర్తనమున సిద్ధించుఁ గోర్కెల్, ప్రవ
ర్తించున్ వీరల యద్గుజాడ, గతివీరేయంచు లోకమ్ము జీ
వించున్, వీరలు మెట్టినట్టి తల ముర్విన్ దీర్ఘమై రాజిలన్

PDF Compressor Pro



ఉ॥ ఆగ్రహచిత్తుఁడైన యొకయజ్ఞుఁ డొనర్చు యకృత్య మిట్టిదో
విగ్రహమేల నైచెనని వెల్వెలబోయెద, రెచ్చునిగ్రహా
నుగ్రహశక్తి బైటపడునో, శుభకాలము రాకయుండు న
య్యా! గ్రహియింపఁగాఁ దరమయా! మనభారతసంప్రదాయముల్.

చ॥ క్షమకవచమ్ము, కార్ముకము సత్యమహింసలె, చూడ నీశరీ
రమె రథ, మందుజీవుఁడె తిరమ్ముగఁ దా రథికుండు, బుద్ధియు
త్తమరథచోదకుండు బెడిదంబగు కామగుణాది శత్రువ
ర్గమును జయించి, ధర్మము జగమ్మున నిల్పుటె పూరుషార్థముల్.

మ॥ మును తాఁ జేసిన దుష్కృతమ్ము, సుకృతమ్ముల్ జీవికిన్ జన్మకా
రణమై, కష్టసుఖమ్ము లొందును, నిజప్రారబ్ధసంప్రాప్తముల్
తన స్వర్గంబును, నారకమ్మును, బరుల్ గారిందుఁ గర్తల్, నిజం
బునకుఁ గర్తయె భోక్తయౌట తెలియంబోసుంత యోజించినన్

ఉ॥ కావునఁ దానొనర్చు ప్రతికార్యము విశ్వహితార్థమైన నే
జీవితమెల్ల సార్థకత జెందినయట్లగుఁ గాన, లోనహం
భావమమత్వముల్ విడచి, స్వార్థపరత్వము లేక, లోకర
క్షావిధిమైఁ బ్రతిక్షణము కాలుగదల్చి, చరింపమేలగున్.

శా॥ కోపంబూనుట పాడిగాదెవరికిన్, గోపమ్మె తా శత్రువై
తోపంజేయదు యుక్తకార్యమది యేదో, తానెవారో, నెసన్
పాపమ్మె యొడిగట్టి, స్వీయకృతపాపావిద్ధుఁడై, లోకమున్
దూ పట్టన్ శునకాదులంబలెనె సందుంగొందులన్ ద్రిమ్మందుఁబో.

PDF Compressor Pro


మ॥ తనకేదో యపరాధముం జలిపె నీతం డంచుఁ గ్రుద్ధాత్ముఁడై
గనులుం గానఁ డెఱుంగఁ డించుకయు, యుక్తాయుక్త కార్యంబెదో
తనకుం గీడొనరింపఁ జాలు, తనయంతః శత్రువౌ కోపమున్
గని, కోపింపక, బైటిశత్రువుపయిం గాల్ద్రివ్వ మేలౌనొకో.

మ॥ అకటా! హైందవుఁడై జనించుట నెకాదా యీమహాఘోరపా
తకమిట్టుల్ పొరిగొంట పుట్టిరిదె నేత్రద్వంద్వముం విప్పరిం
చుక నయ్యో! పసికూనలీకరణి, నిచ్చో మొగ్గలం ద్రుంచుపో
లిక ఖండింతురె! మీగృహమ్ములను లేరే! బిడ్డలున్ బాపలున్.

మ॥ కనుడీ! కాటుకకన్నులిప్డు తొరటల్ కాయమ్ము హేయమ్ముగా
శునకం బేనియు ముట్టబోనికరణిం జూపట్టె, నజ్ఞానులై
క్షణమాత్రంబగు జీవితమ్మిటు వృథాగావింతురే! మోహపా
శనిబద్ధుల్ గడతేఱలేరు, తమచేష్టల్ మృత్యువై మ్రింగఁగా.

మ॥ కనఁగాఁ జంపఁగరానివాఁ డెవఁడొ, యీకాయంబునం దుండె, నా
తనిప్రేరేపణ నాటలాడెనని చైతన్యమ్ము లేనట్టి పీ
నిని దున్నాడిన, వానిఁ జంపినటులౌనే! రూపమున్ లేకయుం
డెనుగా, జీవులలో నభేదముగఁ గంటే! యాత్మతత్త్వంబిలన్.

ఉ॥ కాలముచేరువాతటి నొకండును నిల్వక ధాత్రిపైన, 'భ
త్యాల'వి, నిండినట్లు, ప్రియులౌ, సుతదారల వీడి, లీనమౌ
కాలములోన, గింజుకొనఁగా, బ్రతికింపఁగలారు లేరు, భే
దాలివి యేటికో! ప్రకృతిధర్మము నాపగసాధ్యమే యెటన్.

PDF Compressor Pro


చ॥ అతఁడు మహాత్ముఁ, డాతని పదాబ్జముసోకిన దీపవిత్ర భా
రత, మిటజన్మకల్గుట పురాకృతపుణ్య, మతండు నిర్మలా
మృతమయమూర్తి, యాతనియమేయదయామయదృష్టిసోకి, జీ
విత మిలసార్థకంబనుచు వింటిని, కంటిని, మంటిని త్రతిన్.

ఉ॥ అట్టిమహాత్ము పాదరజమాఁదలఁదాల్చి, తరింతునంచుఁ జే
పట్టి, మహాత్ముఁడాదినము పాదతలమ్మును మోపినట్టి య
ప్పట్టునగల్గుమట్టి బయివస్త్రమునన్ బిగఁగట్టి, సంబరం
బుట్టిపడంగఁ బర్వున గృహోన్ముఖుఁడై చని, బాలుఁడిట్లనున్

మ॥ అమ్మ! మహాత్ముఁడంట, మన హైందవులన్ బ్రతికింపఁ బంపె దై
వమ్మిటు, పాదచారియయి పల్లియకుంజను దెంచెఁగాంచఁగా
రమ్మికయింతయే నిసుమురాలనటుల్ జనతాప్రవాహముల్
క్రమ్మెఁగదమ్మ తన్మహిమఁగాంచఁగ రాఁగదవమ్మ వెంబడిన్

ఉ॥ అమ్మ! నిజమ్ము నమ్మమ! మహాత్ముల పాదరజమ్ముసోకి, ప్రా
ణమ్ములఁదాల్చి, మున్నుశిల నాతిగ మారె, శిలాసదృశుచి
త్తమ్ముల మార్పు లేమియరుదా! యిదె తెచ్చితినమ్మరో! పవి
త్రమ్ముతదంఘ్రి ధూళి చిరపాపహరమ్ము ధరింపుమాఁదలన్.

చ॥ అను నిజపుత్రుఁ గాఁగిటఁ బ్రియమ్మునఁ జేరిచి, తచ్చిరమ్ము మూ
ర్కొని, హృదయమ్ము వాఁగ, పలుకున్ శుభమయ్యెఁగుమార! యమ్మహా
త్ముని గను భాగ్యమబ్బెనని పుత్రకుఁడిచ్చిన పాదధూళిఁ దా
ల్చెను శిరమందు నంతఁదరలెన్ మహితుండు మఱొక్క పల్లెకున్.

PDF Compressor Pro


చ॥ ధరణి, నసత్య సత్యము, లధర్మము ధర్మ, మహింస హింసయున్
బరగును ద్వంద్వముల్ సతము వైరము వీనికి, తద్వశాత్ములై
పురుషులునున్ మిథఃకలహబుద్ధి జరించుచునంత ఘోరసం
గరముఖమందు మ్రందుదురుగాదె! క్షమారహితాత్ములక్కటా!

శా॥ తెల్లంబై యిటు లామహాత్ము ప్రియమౌ, దివ్యోపదేశమ్ము లా
పల్లీపత్తనవాసులెల్ల విని, 'అబ్బా! యేసుక్రీస్తో, యితం
డల్లా యో! మరిబుద్ధుఁడో' యనుచుఁ దా మానందముప్పొంగగా
నుల్లంబుల్ వెసదేరి పల్కిరి, 'దయాళూ! భారతోద్ధారకా'.

చ॥ ఎఱిగియెఱుంగ* కిమ్మెయిని హింసకుజొచ్చితి; మీరువచ్చి మా
దురితములెల్ల నూడ్చి, తరితో భవదుక్తి సుధారసమ్ముటుల్!
బఱపితిరింక, మాభవము పావనమయ్యెను నేటికిన్ మహా
పురుష! క్షమింపుమీ! జరిగిపోయినవాని సహింపుమీ! యిఁకన్

క॥ అని పదములపైఁబడి, యీ
తనిమేలగు ధర్మబోధ తత్పరమతులై
విని, శాంతిని నెలకొల్పన్
జని రెవరికివార, లొక్కసంజ నెదురుగా.

ఉ॥ కుత్తుకను త్తరింపఁ దమకున్ మనసాడక, లోన బత్తి రే
కెత్త, మహాత్మసన్నిధికి నేగి, తురుష్కులు, వే కటారులున్
గత్తులు ప్రోవువెట్టి పదకంజములన్ బడి సైపు మంచుఁ జే
యెత్తినమస్కరించి, నుతియించిరి గాంధిని నాత్మబంధునిన్.

PDF Compressor Pro



మ॥ క్షమియింపంగదవయ్య! మమ్ముఁక, నహింసాచక్రవర్తీ! స్వధ
ర్మము నిల్పన్ భరతోర్విపై నవతరింపంజాలి, తీఖండఖం
డములన్, నీయసమానసద్గుణములెన్నన్ వెల్గెదా! పూరుషో
త్తమ! శ్రీమోహనదాసగాంధిరో! మహాత్మా! శాంతిసంధాయకా.

గీ॥ ఈ మహాత్ముని హితబోధ నెల్లవారి
హృదయములు శాంతిఁ జెందఁగా, హిందువులు, మ
హమ్మదీయులు మరల స్నేహమ్ముతోడఁ
గలసి మనజొచ్చి, రంత నౌకాళిలోనఁ
బ్రజలు జేజే లొసంగి, స్తోత్రమ్ముఁజేయ.

అ॥ ఈనవకాళి, నీవలననేగద! నేడు సజీవమయ్యె, స్వ
ప్రాణములొడ్డి కాచినదయామయ! యీనవకాళిపీవె సు
మ్మా! నవకాళి పాలిపరమాత్మవు, నాత్మవు, నీవులేని నా
డా 'నవకాళి,' 'కాళికి,' విహారము, హారము, 'కాళి'యేసుమీ!

ఉ॥ నీవు మహాత్ముఁ డౌటదియు నిక్కము, నీనవకాళియాత్ర యీ
భూవలయమ్మునన్ నిలచిపోయెఁగదయ్య, యశమ్మునిండ నీ
జీవితమెల్ల సార్థకత జెందెను నేటికి, నీవిఁకన్ జిరం
జీవిగ నిల్చినాఁడవు, ప్రసిద్ధిగనే గద భారతాంబయున్.

సంపూర్ణము.

PDF Compressor Pro

# బృందావన ప్రసూనములు

**వాసుదేవ శతకము** : (ద్వితీయ ముద్రణం)

(శ్రీకృష్ణాష్టోత్తర శతనామానుసంధాన పద్యములు
గల భక్తి ప్రబోధాత్మక గ్రంథము.) ... 0- 8-0

**ముకుందమాల** : (ద్వితీయ ముద్రణం)

(60 శ్లోకములు, పద్యములు, తాత్పర్యసహితం.) ... 0-12-0

**బాపూజీ** :

(పద్యములు గేయములు విశ్వమానవసందేశము,
సత్యస్మృతి—నిర్యాణము.) ... 0- 4-0

**స్వాతంత్ర్యపథము** :

(1921 నుంచి స్వాతంత్ర్య స్థాపనవరకున్ను తదుపరి,
భారత దాస్యవిమోచనకు భారతవీరులు పడిన శ్రమలు,
పద్యములు, గేయములు, బొబ్బిలి పాటలు పాడుగున
దేశభక్తి జిప్పిల్లు వీరరసవత్తర గాథ—120 పుటలు,
త్రివర్ణపతాక ముఖపత్రంతో) ... ... 1- 0-0

**సందర్శనము** : (ఖండకావ్య సంపుటి)

(1. సందర్శనము, 2. వాత్సల్యము, 3. కల్పలత)
చక్కని మృదుమధుర శైలిగల పద్యములు. (అచ్చగుచున్నది.)

PDF Compressor Pro

ప్రాప్తిస్థానం

★

బృందావన ప్రచురణలు

మచిలీపట్టణము

★